జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 9-3-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 611 పేజీలు: 4 వెల : రూ.7

# సృష్టికి మూలం స్త్రీ

* సమాజంలో మహిళలకు ప్రత్యేక స్థానం మనందరి బాధ్యత
* మహిళాభ్యున్నతే.. ప్రభుత్వ ఆశయం
* రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
* జిల్లావ్యాప్తంగా ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



**టెక్కలి/శ్రీకాకుళం, మార్చి 8(వార్త):** రాష్ట్రంలోని మహిళల సమగ్ర అభ్యున్నత సాధించాలన్నదే ప్రభుత్వ ఆశయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆదివారం టెక్కలి ఆదిత్య కళ్యాణ మండపంలో మహిళా మండలి సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి మహిళ వేడుకలను ప్రారంభించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సృష్టికి మూలం స్త్రీ అని, సమాజంలో మహిళలకు ప్రత్యేక స్థానం కల్పించి గౌరవించడం మన అందరి బాధ్యత అని అన్నారు. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష అన్నారు. 1982 సంవత్సరంలో నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రి అయిన తర్వాత సమాజంలో మహిళలకు పేరు, గుర్తింపు తెచ్చారన్నారు. రాష్ట్రంలో పురుషులతో సమానంగా స్త్రీలకు సమాన హక్కుల కోసం ఎన్టీఆర్ కృషిచేశారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టి ఆలోచనతో భవిష్యత్తులో మహిళలు ఉన్నత స్థితిలో నిలపాలన నిర్ణయంతో డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలకు రుణాల అందజేసి ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా తోడ్పాటు అందిస్తున్నారన్నారు. నారీమణులు ఆత్మవిశ్వాసంతో సమాజంలోని సవాళ్ళ ను ఎదుర్కోవాలని సూచించారు.




సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా మహిళల సౌకర్యం కోసం ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకం దిగ్విజయంగా అమలవుతుందని గుర్తు చేశారు. మహిళలకు మరింత సౌకర్యం పెంచేలా వచ్చే రెండు సంవత్సరాల్లో దశలవారీగా ఎలక్ట్రికల్ ఏ సి బస్సులను ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. పిల్లలను విద్యలో ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు తల్లికి వందనం పథకం కింద 69 లక్షల మంది తల్లుల ఖాతాలో పది వేల కోట్ల రూపాయలను జమ చేసి తల్లులకు గౌరవం తీసుకువచ్చామన్నారు. దీపం క్రింద 3 ఉచిత సిలిండర్లను అందజేశామని పేర్కొన్నారు. 2014- 19 సంవత్సరంలో ఇల్లు కట్టుకుని బిల్లులు మంజూరు కానీ లబ్ధిదారులకు బిల్లులు మంజూరు చేయనున్నామన్నారు. 2019 నాటికి పేదలకు18 లక్షల ఇల్లు నిర్మించాలన్నదే ప్రభుత్వ లక్ష్యంగా కృషి చేస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కేటాయించినట్లు చట్టం చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర పరిస్థితుల దృష్ట్యా జనాభా సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందని సి ఎం భావిస్తున్నారని తెలిపారు. ప్రసవం సమయంలో మహిళలకు రూ.25వేల ఆర్థిక ప్రోత్సాహాన్ని అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం మహిళా మండల సభ్యులకు బ్యాంక్ లింకేజీ, శ్రీనిధి, ఉన్నతి, సిఐఎఫ్ రుణాలు రూ.328 కోట్ల నమూనా చెక్కు ను మంత్రి చేతులమీదుగా అందజేశారు. మహిళలను దుస్సాలువాతో సన్మానించి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలను మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎం కృష్ణమూర్తి, మాజీ పి ఏ సి ఎస్ అధ్యక్షులు కింజరాపు హరిప్రసాద్, కళింగ వైశ్య అధ్యక్షులు బోయిన గోవింద రాజులు, కోటబొమ్మాళి మార్కెట్ కమిటీ చైర్మన్ బగాది శేషు, డీఎల్ డి ఓ అలివేలుమంగ, ఆర్ డి ఎ ప్రత్యేక అధికారి కరగాన మోహనరావు, ఐసిడిఎస్ పిడి రూపలత, టెక్కలి, కోటబొమ్మాళి ఎంపీడీవోలు రేణుక, ఫణీంద్ర కుమార్, టెక్కలి, నందిగాం, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల ఏపీఎంలు పి ఉమారాణి, టి మనోరత్నం, టి సూర్యనారాయణ, జి శ్రీనివాసరావు, నియోజవర్గంలోని సిడీపీఓలు, మహిళా మండల సమైక్య అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతలో జిల్లా ఫస్ట్

**శ్రీకాకుళం, మార్చి 8(వార్త):** మహిళా సాధికారతకు సంబంధించి వివిధ పథకాల అమలులో శ్రీకాకుళం జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గర్వంగా ప్రకటించారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మహిళా సంఘాలకు రూ. 2266 కోట్ల క్రెడిట్ లింకేజీ, శ్రీనిధి ద్వారా రూ. 312 కోట్లు, ఉన్నతి పథకం కింద రూ. 7 కోట్లు అందించి ఆర్థికంగా బలోపేతం చేశామని, అందుకే మన జిల్లా రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నిలిచిందని వివరించారు. 'లక్పతి దీదీ' పథకం కింద ఇప్పటికే 5,300 మందిని గుర్తించామని, ఈ ఏడాది లక్ష మందిని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. చదువుకున్న వారితో పాటు చదువు లేని వారు కూడా స్వశక్తితో ముందంజలో ఉండటమే మహిళా శక్తికి నిదర్శనమని కొనియాడారు. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. పోలీసు శాఖ మహిళా భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి ఒక్కరూ 'శక్తి యాప్' ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. సమాజంలో ఆడపిల్లలకు జాగ్రత్తలు చెప్పడం కంటే, మగపిల్లలు తప్పు చేయకుండా పెంచడంపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, తల్లికి వందనం, ఉచిత గ్యాస్, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు వారి జీవితాల్లో మార్పు తెస్తున్నాయని పేర్కొన్నారు. డ్వాక్రా రుణ పరిమితిని రూ. 5 లక్షలకు పెంచామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సాయి ప్రత్యూష, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతి, మెప్మా పీడీ, డిఆర్డిఏ పిడి కిరణ్ కుమార్, ఎల్డిఎం శ్రీనివాసరావు మహిళా అధ్యక్షురాలు గంగమ్మ, ఐసిడిఎస్ పిడి రూపవతి, పెద్ద ఎత్తున డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## బాల్య వివాహాల విముక్తి ప్రచార రథం ప్రారంభం

**టెక్కలి: మార్చి 8(వార్త):** బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదివారం ప్రారంభించారు. ఈ రథం ద్వారా గ్రామాల వారీగా అవగాహన కార్యక్రమాలు చేపట్టి, బాలికల హక్కులపై ప్రజల్లో చైతన్యం కల్పించడం చాలా అవసరమని అన్నారు. బాల్య వివాహాలు బాలికల భవిష్యత్తును నాశనం చేస్తాయని,అందుకే ప్రతి కుటుంబం, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, సమాజంలోని ప్రతి ఒక్కరు కలిసి బాల్య వివాహాలను నిరోధించడంలో భాగస్వాములు కావాలి అని సూచించారు. ప్రచార రథం ద్వారా వైద్య, విద్య, సామాజిక సేవలు, హక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. గ్రామాల వారీగా రథం సందర్శన ద్వారా ప్రజలకు బాలికల హక్కులు, బాల్య వివాహాల నిర్మూలనకు అవగాహన కల్పించాలని అన్నారు. విధి నిర్వాహణలో అధికారులు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బాల్య వివాహాలను నిర్మూలనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి పాల్గొన్నారు.





## విద్యార్థులకు యువ ఇంజనీర్ 'రంజిత్' కిట్లు పంపిణీ

**మందస, మార్చి 8(వార్త):** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఇంజనీర్ కిట్లు పంపిణీ చేసి, ఉదారతను చాటుకున్నారు. మందస మండలంలోని మఖరజోల గ్రామానికి చెందిన గెడ్డవలస రంజిత్ అనే యువకుడు మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ఆయన జన్మదినం సందర్భంగా మఖరజోల గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు కావాల్సిన కిట్లు అందజేశారు. ఇదే పాఠశాలలో ఆయన చదువుకున్నారు. ప్రతీ ఏడాది కూడా ఏదో ఒక రూపంలో రంజిత్ విద్యార్థులకు సాయమందిస్తుంటారు. రంజిత్ చూపిన ఔదార్యంపై స్థానికులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## ఉత్తమ ప్రతిభకు చక్కని సత్కారాలు



**మందస, మార్చి 8(వార్త):** మహిళా సంఘాలను ప్రగతి పథంలో నడిపించడానికి ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళా ఉద్యోగులను, సమాఖ్య లీడర్లను పలాస నియోజవర్గ స్థాయి మహిళా దినోత్సవ కార్యక్రమంలో సత్కరించారు. మండల సమాఖ్య పాలకవర్గ సభ్యులను, క్లస్టర్ కోఆర్డినేటర్లను, ఉత్తమ ప్రతిభ కనబరిచిన వీవోఏలు బేతాళపురం పంచాయతీ పెద్దమ్మతల్లి గ్రామ సంఘం నుండి శివలక్ష్మి, మఖరజోల పంచాయితీ నుంచి బమ్మిడి సంధ్యారాణి, నియోజకవర్గస్థాయి ప్రత్యేక అధికారుల సమక్షంలోసత్కరించి పుష్పగుచ్ఛం, మెమొంటోలతో గౌరవించారు. ఈనారి సీఆర్పీగా పితాతొలి గ్రామ సంఘం నుండి సిగులపల్లి త్రివేణి, వందన్ వికాస్ కేంద్రాల పెట్టవ అధ్యక్షురాలు సవర భారతిలను కూడా సత్కరించినట్లు మందస వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు తెలిపారు.

## సిక్కోలు ఉద్దానం సేవా సమితి ఉదారత



**మందస, మార్చి 8(వార్త):** సముద్రంలో ప్రమాదం జరగడంతో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తికి సిక్కోలు ఉద్దానం సేవా సమితి సాయం అందించింది. మందస మండలంలోని భేతాళపురం పంచాయతీ రట్టిలో శ్రీవల్లభనారాయణస్వామి డోలోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా సముద్ర తీరానికి భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు. సోంపేట మండలం సోంపేట గ్రామానికి చెందిన ఎ.వాసుదేవు అనే వ్యక్తి రట్టి బీచ్‌లో ఐస్ క్రీమ్ అమ్ముకుంటూ సముద్ర స్నానానికి వెళ్ళాడు. అలల తాకిడి వాసుదేవు తీవ్రంగా గాయపడ్డాడు. మెరైన్ పోలీసులు ప్రాణాపాయస్థితి నుంచి కాపాడారు. ప్రస్తుతం ఆయన శ్రీకాకుళం మెడికవర్ హాస్పిటల్ లో ట్రీట్మెంట్ తీసుకుంటున్నారు. ట్రీట్మెంట్ కు రూ.14లక్షలు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. విషయం తెలుసుకున్న సిక్కోలు ఉద్దానం సేవా సమితి ఆధ్వర్యంలో రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమములో సేవా సమితి సభ్యులు జాను, రంజిత్, అనిల్, పూర్ణ పాల్గొన్నారు. దాతలు, సేవా సంస్థలు కూడా బాధితుని ఆదుకోవాలని వారు కోరారు.

## మృతుని కుటుంబానికి మాజీ మంత్రి 'శివాజీ' పరామర్శ



**మందస, మార్చి 8(వార్త):** మందస మండలంలోని రాంపురం పంచాయతీ తిమ్మల బిడిమి గ్రామానికి చెందిన తిమ్మల జగన్నాయకులు ఇటీవల మరణించారు. తెలుగుదేశం పార్టీ నాయకునిగా ఈ ప్రాంతంలో ఎన్నో మంచి సేవకు అందించిన జగన్నాయకుల కుటుంబాన్ని మాజీ మంత్రి గౌతు శ్యాంసుందర శివాజీ పరామర్శించారు. జగన్నాయకులు లేని లోటు తీర్చలేనిదన్నారు. మృతుని కుటుంబానికి సానుభూతి తెలిపి, జగయన్నాయకుల ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, బాలిగాం పీఏసీఎస్ అధ్యక్షుడు లబ్బ రుద్రయ్య, పార్టీ నాయకులు జుత్తు అమ్మినాయుడు, చెల్లూరు శంకర్, సాలిన వెంకటరావు పాల్గొన్నారు.

## కూచిపూడి 'శైలజ' ప్రతిభకు నారీశక్తి




**మందస, మార్చి 8(వార్త):** నారాయణశెట్టి శైలజ నాట్య మయూరిగా గుర్తింపు తెచ్చుకున్నారు. అంచలంచెలుగా నాట్యరంగంలో ఎదుగుతున్నారు. మందస పట్టణానికి చెందిన శైలజ కళామాతల్లికి మంచి సేవలు చేస్తూ.. తరిస్తున్నారు. దీంతో ఆమె ప్రతిభకు అవార్డులు, రివార్డులు సొంతమవుతున్నాయి. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మందసకు చెందిన ప్రముఖ కూచిపూడి నాట్య గురువు నారాయణశెట్టి శైలజకు తెలంగాణాకు చెందిన నవభారత్ కళాక్షేత్రం 'నారీ శక్తి' పురస్కారం బహుకరించి, ఆమెను ఘనంగా సన్మానించారు. కూచిపూడిరంగంలో శైలజ చూపించిన ప్రతిభకు, సేవభావం, అంకితభావం, పట్టుదలతో పాటు చేస్తున్న నిరంతర కృషికి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నారీశక్తి పురస్కారం ప్రదానం చేసినట్టు నవభారత్ కళాక్షేత్రం ప్రతినిధులు చెప్పారు. ఈ వేడుకలు హైదరాబాదులోని త్యాగరాయగానసభలో డాక్టర్ కుమార్ నాయక్, డాక్టర్ రంజిత్ కుమార్, సినీనటి మేఘన చేతుల మీదుగా ప్రదానం చేశారు.

# మహిళల హక్కుల కోసం పోరాడుదాం

### పీఓడబ్ల్యు శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి కార్యదర్శి కుసుమ




**పలాస, మార్చి 8 (వార్త):** మహిళల హక్కుల కోసం ఉద్యమించాలని ప్రగతిశీల మహిళా సంఘం(పిఓడబ్ల్యు) శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి కార్యదర్శి పోతనపల్లి కుసుమ పిలుపునిచ్చారు. ఆదివారం పలాస మండలం మామిడిపల్లిలో ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యు) ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా శ్రామిక పోరాట దినం మార్చి 8 సందర్భంగా సభ నిర్వహించడం జరిగింది. ఈ సభకు పిఓడబ్ల్యుజిల్లా అధ్యక్షులు ఈశ్వరమ్మ అధ్యక్షత వహిస్తూ మాట్లాడుతూ మహిళలపై అమలవుతున్న అన్ని రకాల హింసలకు వివక్షలకు వ్యతిరేకంగా పోరాడుదామని స్త్రీ పురుష సమానత్వం కోసం పోరాడదమని, సమాన పనికి సమాన వేతనం కోసం పోరాడుదమని, మహిళల పనిహక్కు గ్యారెంటీ కోసం పోరాడదాం అని, నివాస హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తించాలని, కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రకారం పట్టణ పరిధిలో రెండు సెంట్లు భూమిని ఇండ్ల స్థలాలకు కేటాయించాలని నినదించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మోడీ ప్రభుత్వం శ్రామిక వర్గ మహిళల పై పనిభారాన్ని మోపుతూ వారి శ్రమను దోచుకునేందుకు అదనపు పని గంటలు పెంచుతూ, కార్పొరేట్లకు ఊడిగం చేసే విధానాలను అమలు చేస్తున్నారని అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరు మార్చి, బడ్జెట్లో కోతలు విధిస్తూ క్రమంగా ఆ పథకాన్ని రద్దు చేసేందుకు కుట్ర పన్నుతున్నారని, ఇది 26 లక్షల కోట్ల ఉపాధి జాబ్ హోల్డర్లకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల కొనుగోలు శక్తిని పెంచేందుకు, వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు, ఉపాధి కల్పించేందుకు ఈ పథకాన్ని అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని అన్నారు. ఉపాధి హామీ పథకంలో అత్యధికంగా పని దొరికేది మహిళలకు, దళిత, ఆదివాసి, గిరిజనులకు మాత్రమేనని, ఆ చట్టాన్ని రద్దు చేస్తే ఆ సామాజిక వర్గ ప్రజలు తీవ్రంగా నష్టపోతారని విమర్శించారు. పేరు మార్చిన ఈ పథకానికి 60 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్రాలు ఖర్చులు భరించాలని నిర్ణయించడం అంటే దాన్ని క్రమంగా ఎత్తివేసే ఆలోచనేనని అన్నారు. దేశవ్యాప్తంగా మోడీ ప్రభుత్వం చట్టాలలో మార్పులు చేస్తూ ముఖ్యంగా మహిళ శ్రామిక వర్గంపై భారాలు మోపడానికి పూనుకున్నదని, ఈ విధానాలకు వ్యతిరేకంగా అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని స్ఫూర్తిగా తీసుకొని మహిళలు సంఘటితంగా ఉద్యమించాలని అన్నారు. ఐఎఫ్టియు జిల్లా నాయకురాలు సబలాపురపు కృష్ణవేణి మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం మూడవసారి అధికారంలోకి వచ్చాక మహిళలపై దాడులు, హత్యలు, హత్యాచారాలు, లైంగిక వేధింపులు ఎక్కువయ్యాయని మండిపడ్డారు. సామాజిక భద్రత కరువయిందని అన్నారు. మహిళలు పురుషాధిపత్యంపై ఉద్యమిస్తూనే సామాజిక, రాజకీయ చైతన్యం పెంచుకొని పోరాడాలని, మహిళలపై వేధింపులపై స్పందించి, సామాజిక రుగ్మతలపై గొంతెత్తాలని పిలుపునిచ్చారు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వంకల మాధవరావు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ఐఎఫ్టియు జిల్లా నాయకులు జుత్తు వీరాస్వామి, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు గొరకల బాలకృష్ణ, పి వై ఎల్ నాయకులు సార జగన్ సభలో సందేశాలు ఇచ్చారు. అరుణోదయ జిల్లా కార్యవర్గం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రామారావు, సోమేశ్, రచయితలు వంకల రాజారావు కుత్తుం వినోద్ పాట మాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పి ఓ డబ్ల్యు జిల్లా కమిటీ సభ్యులు అప్పనమ్మ, బార్ల జానకి. కుత్తుం జానకి, లత, డిల్లీశ్వరి , ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వంకల పాపయ్య, జిల్లా నాయకులు జడ్డే అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

## బలియాగాంలో అంతర్జాతీయ మహిళా పోరాట దినం



**మందస, మార్చి 8(వార్త):**మందస మండలంలోని కుసుమల పంచాయతీలో బలియాగాం గ్రామంలో శ్రీకాకుళం గిరిజన శక్తి సంక్షేమ సంఘం, రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా పోరాట దినం(మార్చి8) ఘనంగా నిర్వహించారు. రైతు కూలీ సంఘం కోనేరు రమేష్ మాట్లాడుతూ మార్చి 8న అంతర్జాతీయ మహిళా పోరాటదినం ప్రకటించి 116సంవత్సరాలు అయ్యిందన్నారు. ఆనాటి పెట్టుబడిదారుల వ్యవస్థలో కార్మికులు 14నుండి 18 గంటలు వరకు వెట్టి చాకిరీలతో మగ్గిపోయేవారని, కార్మికుల శ్రమ దోపిడీతోనే లాభాలు గడిచే ప్యాక్టరీలలో అమానవీయమైన అణచివేతను వివక్షను ఎదుర్కొన్న మహిళా కార్మికుల నెత్తురు ధార బోసి వారి హక్కుల కోసం తెగించి పోరాడారన్నారు. తమపై సాగుతున్న శ్రమ దోపిడికి వ్యతిరేకంగా, వేతనం పెంపు కోసం, మెరుగైన పరిస్థితి కోసం, కనీస సౌకర్యాల కోసం, మీటింగ్ లు పెట్టుకొనే హక్కు కోసం, యూనియన్ లో తాము కూడా భాగస్వామి కల్పించాలని నిలదీస్తూ, 1908సంవత్సరంలో రోజుకి 8గంటల పని సమయం, మెరుగైన వేతనం, సమాజంలో ఓటేసే హక్కు స్త్రీ, పురుష మధ్య సమానత వంటి ఎన్నో హక్కులను సాధించుకోగలిగిందన్నారు. మహిళల డిమాండ్ ను దృష్టిలో పెట్టుకొని అమెరికాలోని సోషలిస్ట్ పార్టీ 1909సంవత్సరంలో జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించిందన్నారు. 1975సంవత్సరంలో ఐక్యరాజ్యసమితి మార్చి 8న మహిళా దినోత్సవంగా ప్రకటించడంతో పశ్చిమ దేశాలన్నిటితో పాటు భారతదేశం కూడా అధికారికంగా ప్రకటించడం మొదలుపెట్టిందన్నారు. హింస లేని సమాజం మన హక్కు అని మహిళ నినదిస్తుంటే హత్యలు, అత్యాచారాలు చేస్తున్న వారికే ప్రజా ప్రతినిధులుగా నిలబెడుతున్నారని ఆరోపించారు. నేడు మన దేశంలో దశాబ్ద కాలంగా పోరాడి సాదించుకొన్న హక్కులు కాలరాయబడుతున్నాయని, మహిళలు అనేక సమస్యలు సవాళ్ళు ఎదుర్కొంటున్నారన్నారు. మహిళల నిరంతరం తమ హక్కులను నిలబెట్టుకోవడం కోసం, వ్యక్తిగతం కలిగిన మనుషులుగా సమాజంలో నిలబడడానికి వ్యక్తిగతంగా సామూహికంగా పోరాడుతూనే ఉన్నారని, పోరాటాల ఫలితంగా మనువాద దురాచారా సంప్రదాయాలకు వ్యతిరేకంగా పోరాడి అనే హక్కులను సాధించుకున్నారన్నారు. నేడు మహిళలమీ మనుషులుగా గుర్తించని మనువాదాన్ని పాలకులే ముందుగా తెస్తున్న పరిస్థితిని ఎదుర్కొంటున్నామన్నారు. రాష్ట్రంలో మహిళలపై హింస గతం కంటే ఎక్కువ పెరిగిందని రిపోర్టులు తెలియజేస్తున్నాయన్నారు. పెరుగుతున్న హింస స్త్రీలను బయటకు రాకుండా, విద్యకు, ఉద్యోగానికి దూరం చేసే ఆలోచనలకు దారితీస్తుందని, ఈ ఆలోచనలు మహిళా ఆర్థిక స్వావలంభనను దెబ్బతీస్తాయని, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలోకి అడుగు పెట్టనివ్వకుండా నిరోధిస్తాయన్నారు. శ్రీకాకుళం గిరిజన శక్తి సంక్షేమ సంఘం అధ్యక్షుడు సవర నరసింహులు మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా దేశంలోని గ్రామీణ పేదలకు ఉపాధి హామీ పథకం ఆసరాగా నిలిచిందని, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతోనే పేదరికంలో వున్న పేదలు ఉపాధి పొంది ఆకలిని, నిత్యావసరాలను తీర్చుకుంటున్నారన్నారు. దేశంలోని గ్రామీణ పేదలకు ఉపాధి కల్పిస్తున్న ఉపాధి హామీ పథకాన్ని క్రమంగా బలహీనపరచి, చివరికి రద్దు చేసేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించిందన్నారు. కొంతకాలం నిధులు పెంచకుండా చేసి ఇప్పుడు ఆ పథకాన్ని రద్దు చేసే విధానాలు అమలు చేస్తుందన్నారు. ఉపాధి పథకంలో ప్రజల్ని మభ్య పెట్టేందుకు 100 రోజుల పనిని దినాలను 125రోజులుగా మార్చి రోజుకి పని సమయం 10 గంటలు పెంచి మన నుంచి దోచుకొంటుందన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా స్త్రీముక్తి జిల్లా నాయకురాలు కోనేరు మంజుల, శ్రీకాకుళం గిరిజన శక్తీ సంక్షేమం సంఘం నాయకులు హరికృష్ణ, బాలకృష్ణ, దాశరథి, యేసయ్య, జగన్, బాలనందు, స్థానిక సర్పంచ్ సుధాకర్, సవర కుమారి, భారతి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో పోటీ పడాలి



**పలాస, మార్చి 8 (వార్త):** మహిళలు అన్ని రంగాల్లో పోటీపడటం, సమాజ ప్రగతికి కీలకమని పలాస డిప్యూటీ ఎంపీడీవో ఉమాపతి అన్నారు. ఆదివారం ప్రపంచ మహిళా దినోత్స సందర్భంగా ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ మండల అధ్యక్షులు ఈశ్వరరావు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పలాస బాలిక గిరిజన పోస్ట్ మెట్రిక్ వసతి గృహంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాపతి మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని ప్రశంసించారు. ప్రస్తుతం భారతదేశంలో మహిళల సాధికారత్వానికి ప్రభుత్వాలు భారీ నిధులు కేటాయిస్తున్నాయని చెప్పారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్. జగన్ నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని రంగాల్లో మహిళలే ముందున్నారని గర్వంగా ఉందని కొనియాడారు. జేఏసీ అధ్యక్షులు ఎస్. రాంబాబు మాట్లాడుతూ మహిళలు ప్రస్తుతం అన్ని రంగాల్లో పోటీ పడుతున్నారని ప్రభుత్వం వారు కూడా మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆల్ ఇండియా ఆదివాసి ఎంప్లాయి ఫ్యాట్రిషన్ సంఘ సభ్యులు అందరూ పాల్గొన్నారు.

## మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యం



**టెక్కలి: మార్చి 8(వార్త):**మహిళల రక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా వన్ స్టాప్ సెంటర్‌ను ప్రారంభించారు. ప్రత్యక్ష ప్రసారాన్ని మంత్రి వీక్షించారు. అనంతరం జిల్లా ఆసుపత్రిలోని వన్ స్టాప్ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న బాలికలకు మహిళలకు సేవలు అందించేందుకు వన్ స్టాప్ సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మహిళలకు వైద్య, ఆర్థిక సహాయం, న్యాయ సహాయం అందించేందుకు ఆపన్న హస్తంలా నిలుస్తుందన్నారు. వన్ స్టాప్ సెంటర్ సేవలను గ్రామ మండల స్థాయిలో పాఠశాలల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను మంత్రి సూచించారు. మహిళల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహిళల భద్రత, సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 10 వన్ స్టాప్ కేంద్రాలు మంజూరు కాగా, వాటిలో ఒక కేంద్రాన్ని టెక్కలిలో ఏర్పాటు చేయడం జరిగిందని మంత్రి వెల్లడించారు. ఈ కేంద్రం ద్వారా జిల్లాలోని మహిళలకు అత్యవసర సమయంలో సమగ్ర సహాయం అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్ గారు, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, వైద్యులు,తెలుగు దేశం పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆత్మవిశ్వాసమే మహిళల బలం

**నరసన్నపేట, మార్చి 8(వార్త):** నరసన్నపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వాణిజ్య పన్నుల సహాయ కమిషనర్ రాణి మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు ఆత్మవిశ్వాసమే అసలు బలమని పేర్కొన్నారు. చదువు, ఉద్యోగం, నాయకత్వం వంటి అనేక రంగాల్లో మహిళలు ముందంజలో ఉన్నారని తెలిపారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో ముఖ్యమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఝాన్సీ మాట్లాడుతూ ఆత్మవిశ్వాసం, కృషి, పట్టుదల ఉంటే మహిళలు జీవితంలో విజయాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ దుర్గాప్రసాద్, మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



## మహిళల సాధికారతకు క్రీడలే ప్రతీక

*** జిల్లా ఉపాధి అధికారిణి కొత్తలంక సుధ**
*** కోడి రామ్మూర్తి స్టేడియంలో 'అస్మిత' అథ్లెటిక్స్ పోటీలు * విజేతలకు పతకాలు, ప్రశంసా పత్రాల అందజేత**



**శ్రీకాకుళం, మార్చి 8 (వార్త):** మహిళల సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధనలను గుర్తించే రోజు అంతర్జాతీయ మహిళా దినోత్సవమని, ఇది వారి సమానత్వం, సాధికారతకు ప్రతీకగా నిలుస్తుందని జిల్లా ఉపాధి అధికారిణి కొత్తలంక సుధ అన్నారు. ఆదివారం స్థానిక కోడి రామ్మూర్తి స్టేడియంలో భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, జిల్లా క్రీడా సాధికారిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'అస్మిత అథ్లెటిక్స్' కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజ గమనంలో మహిళల కృషి అమూల్యమని, అన్ని రంగాల్లోనూ మహిళలు తమ సత్తా చాటుతున్నారని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వ 'ఖేలో ఇండియా' చొరవలో భాగంగా దేశవ్యాప్తంగా మహిళల్లో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు ఈ అథ్లెటిక్స్ లీగ్ నిర్వహిస్తున్నట్లు మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ కె. వెంకట్ ఉజ్వల్ వివరించారు. ఈ పోటీల్లో సుమారు 256 మంది బాలికలు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. 100, 200, 400 మీటర్ల పరుగు పందాలతో పాటు టగ్ ఆఫ్ వార్ వంటి క్రీడలను నిర్వహించారు. మహిళల ఆరోగ్యం, శారీరక దృఢత్వంపై అవగాహన కల్పించడమే ఈ లీగ్ ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. సెట్‌శ్రీ సీఈఓ వి.వి. అప్పలనాయుడు మాట్లాడుతూ.. కుటుంబంలో ప్రేమానురాగాలను పంచుతూనే, సమాజ బాధ్యతల్లోనూ స్త్రీ మూర్తులు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. క్రీడల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచి, అట్టడుగు స్థాయిలో ఉన్న ప్రతిభను వెలికితీయడమే తమ లక్ష్యమని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎ. మహేష్ బాబు తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల క్రీడాకారిణులను ప్రోత్సహించేందుకు ఇటువంటి వేదికలు ఎంతో దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. అనంతరం వివిధ విభాగాల్లో గెలుపొందిన విజేతలకు అతిథుల చేతుల మీదుగా మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి ఉరిటి సాయికుమార్, కోచ్‌లు, మేరా యువ భారత్ గణంకాధికారి డి. శ్రీనివాసరావు, పెద్ద సంఖ్యలో క్రీడాకారిణులు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఆర్టీసీలో మహిళా దినోత్సవం



**శ్రీకాకుళం, మార్చి 8 (వార్త):** శ్రీకాకుళం-2వ డిపో గ్యారేజీ ఆవరణలో "అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు" శ్రీకాకుళం జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డెప్యూటీ కలెక్టర్ పద్మావతి, రాధారాణి, క్రిష్ణవేణి హాజరై మాట్లాడారు. సాధికారత దిశగా మహిళలు అడుగులు వేయాలన్నారు. చట్టాలను సద్వినియోగ పరచుకోవాలని కోరారు. కాలంతో పాటు మహిళలు కూడా అన్ని రంగాలలో గల అవకాశాలను అంది పుచ్చుకుని ఎంతో పురోగతి సాధించారన్నారు. శ్రీకాకుళం జిల్లాలో గల నాలుగు డిపోలలో విధులను నిర్వర్తిస్తు, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలకు, నగదు పురస్కారం, ప్రశంసా పత్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం 2, టెక్కలి, పలాస డిపో మేనేజర్లు, శర్మ, శ్రీనివాసరావు, శ్యామ సుందర నాయుడు, శ్రీకాకుళం 2వ అసిస్టెంట్ డిపో మేనేజర్లు, సంతోష్, గంగరాజు, గారేజీ సిబ్బంది, పలువురు మహిళా సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది అన్ని అసోషియేషన్ల నాయకులు పాల్గొన్నారు.

# మహిళలతో సమాజాభివృద్ధి

*** రాష్ట్ర పియుసి చైర్మన్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ * ఆమదాలవలసలో మహిళా దినోత్సవం**





**ఆమదాలవలస, మార్చి 8 (వార్త):** ఆమదాలవలస పట్టణంలో శారదా కళ్యాణ మండపం ప్రాంగణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పియుసి చైర్మన్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ పాల్గొని మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేవలం ఇది ఒక వేడుక కాదదని, మహిళలకు ఇచ్చే గౌరవం, కృతజ్ఞత అని తెలిపారు. పురుషుడు ఒక కుటుంబాన్ని నిలబెడితే.. మహిళ ఒక సమాజాన్ని నిర్మిస్తుందన్నారు. స్వాతంత్ర్య పోరాటం నుంచి ఇప్పటి వరకు అనేక మంది మహిళలు సమాజానికి మార్గదర్శకులు అయ్యారని తెలిపారు. మన భారతదేశంలో మహిళలను దేవతలుగా భావించే సంప్రదాయం ఉందన్నారు. మహిళ బలహీనురాలు కాదు...అవకాశం ఇస్తే ప్రపంచాన్ని మార్చే శక్తి ఉన్న నాయకురాలు అని స్పష్టం చేశారు. మన సమాజం అభివృద్ధి చెందాలంటే... మహిళలు భద్రంగా ఉండాలని, విద్యతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని కోరారు. మహిళా సాధికారత అనేది కేవలం ఒక కుటుంబ అభివృద్ధి మాత్రమే కాదు, అది ఒక దేశ అభివృద్ధి అని వెల్లడించారు. మహిళల అభ్యున్నతి కోసం కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. అనంతరం వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన మహిలలకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు మొదలువలస రమేష్, కూటమి నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# మహిళల సాధికారతే సమాజ ప్రగతికి మార్గం

*** నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**



**నరసన్నపేట, మార్చి 8(వార్త):** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నరసన్నపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన కార్యక్రమాన్ని సమన్వయం చేస్తూ మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. మహిళలు కుటుంబాన్ని మాత్రమే కాకుండా సమాజాన్ని ముందుకు నడిపించే శక్తిగా నిలుస్తున్నారని తెలిపారు. నేటి కాలంలో మహిళలు విద్య, వైద్యం, వ్యాపారం, ఉద్యోగాలు, రాజకీయాలు వంటి అనేక రంగాల్లో ప్రతిభ కనబరుస్తూ ముందుకు సాగుతున్నారని అన్నారు. మహిళలు స్వయం సమృద్ధిగా ఎదగడానికి కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా, సామాజికంగా మరింత బలపడాలని సూచించారు. ఆడబిడ్డల భద్రత, గౌరవం మరియు సాధికారత కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆయన తెలిపారు. నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన మాట్లాడుతూ మహిళలు సమాజానికి ప్రేరణగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. కుటుంబ బాధ్యతలతో పాటు సమాజ అభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్య రంగంలో పనిచేస్తున్న మహిళా కార్మికులు గ్రామాల పరిశుభ్రతకు ఎంతో కృషి చేస్తున్నారని, వారి సేవలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ సందర్భంగా నరసన్నపేట పట్టణంలో పారిశుద్ధ్య సేవలు అందిస్తున్న మహిళా కార్మికులను ఘనంగా సన్మానించారు. వారికి శాలువాలు కప్పి, ప్రశంసా పత్రాలు అందజేసి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు తమ సమస్యలు, అభిప్రాయాలను నాయకులతో పంచుకుంటూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, పిఎసిఎస్ చైర్మన్లు, వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు, డైరెక్టర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే నాలుగు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## ట్రిపుల్ ఐటీలో మహిళా దినోత్సవం



**ఎచ్చెర్ల, మార్చి 8 (వార్త):** మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లోనూ రాణిస్తూ, తమదైన ముద్ర వేస్తున్నారని విశాఖపట్నం వినియోగదారుల ఫోరం సభ్యురాలు రహిమునిసియా బేగం అన్నారు. ఆదివారం ఎచ్చెర్లలోని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రహిమునిసియా బేగం మాట్లాడుతూ, భారతీయ సంస్కృతిలో మహిళలకు అత్యున్నత గౌరవం ఉందని పేర్కొన్నారు. నేటి సమాజంలో ప్రతి సవాలును స్వీకరిస్తూ మహిళలు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నారని కొనియాడారు. క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట ధన బాలాజీ మాట్లాడుతూ.. స్త్రీలు ఎక్కడ పూజించబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని ఆర్యోక్తి అని గుర్తుచేశారు. ప్రతి పురుషుని విజయం వెనుక ఒక స్త్రీ శక్తి దాగి ఉంటుందని, సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర వెలకట్టలేనిదని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ అరుణ బాలాజీ, పరిపాలనాధికారి డాక్టర్ మునిరామకృష్ణ, డీన్ డాక్టర్ శివరామకృష్ణ, గర్ల్స్ వెల్ఫేర్ డీన్ లక్ష్మీబాల, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ వాసు, క్యాంపస్-2 ఇన్-ఛార్జ్ సాగర్, పలువురు అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## మహిళల హక్కుల రక్షణకు న్యాయ సేవాధికార సంస్థ అండ




**శ్రీకాకుళం, మార్చి 8 (వార్త):** సమాజంలో మహిళలు తమ హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని, ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు ధైర్యంగా న్యాయం కోసం పోరాడాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులతో ఆయన ముఖాముఖి మాట్లాడారు. మహిళలకు ఎదురయ్యే చట్టపరమైన చిక్కులను సత్వరమే పరిష్కరించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధితులు కార్యాలయాన్ని నేరుగా సంప్రదించవచ్చని లేదా ప్రభుత్వం కేటాయించిన టోల్ ఫ్రీ నంబర్ 15100కు కాల్ చేసి ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చని సూచించారు. అమ్మలుగా, చెల్లెళ్లుగా, ఆడపడుచులుగా సమాజానికి అండగా నిలుస్తున్న మహిళలందరికీ ఆయన అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళల పట్ల గౌరవం పెరగడమే కాకుండా, వారికి చట్టం కల్పించిన హక్కులు సద్వినియోగం అయినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సాయి ప్రత్యూష, ఇతర విభాగాల అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

## ఆటపాటలతో మహిళా దినోత్సవం



**ఇచ్ఛాపురం,మార్చి8 (వార్త):** స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయ ఆవరణలో హ్యాపీ ఫ్రెండ్స్ విమెన్ సభ్యులు మహిళా దినోత్సవాన్ని ఆటపాటలతో నిర్వహించారు. టగ్ ఆఫ్ వార్ మ్యూజికల్ చైర్ ఆటలు ఆడి తమ బాల్యాన్ని గుర్తు తెచ్చుకున్నారు కుటుంబ వ్యవహారాలలో పడి బాధ్యతలతో కూడిన జీవితాన్ని కొనసాగిస్తున్న తరుణంలో ఆటవిడుపులా గడుపుకున్నామని ఆనందం వ్యక్తం చేశారు. మ్యూజికల్ చైర్ లో దక్కత రోజా గోపీనాథ్ రెడ్డి, ఉమెన్ ఆఫ్ ది డే గా నిలిచారు. ఫోర్ పోటీలో కాళ్ల జ్యోతి గెలుపొందారు.

## నరసన్నపేటలో చెరువుల ఆక్రమణ

**నరసన్నపేట, మార్చి 8(వార్త):** నరసన్నపేట పట్టణంలో చెరువులు ఆక్రమణలు జరుగుతున్నాయని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువులను ఆక్రమించి భవనాలు నిర్మిస్తున్నప్పటికీ సంబంధిత ప్రభుత్వ అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, అయితే కొంతమంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. చెరువులపై జరుగుతున్న ఆక్రమణలు కొనసాగితే భవిష్యత్తులో నరసన్నపేటలో చెరువులు కనిపించడం కష్టమవుతుందని వారు అంటున్నారు. అందువల్ల సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చెరువులపై జరుగుతున్న ఆక్రమణలను అరికట్టాలని, ప్రభుత్వ ఆస్తులను రక్షించేలా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## జేసిఐ ఆధ్వర్యంలో 'కాబిల్ స్కిల్ అప్, రైజ్ అప్'




**ఇచ్ఛాపురం, మార్చి 8 (వార్త):** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జేసీఐ ఇచ్ఛాపురం ఆధ్వర్యంలో "జేసీఐ ఇండియా కాబిల్ - స్కిల్ అప్, రైజ్ అప్ పేరుతో మహిళలకు ఒక నెలపాటు నిర్వహించే సాధికారత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని జ్యోతి బ్యూటీ పార్లర్ సహకారంతో, ప్రొఫెషనల్ మేకప్ ఆర్టిస్ట్ దక్కత జ్యోతి మార్గదర్శకత్వంలో నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ ద్వారా మహిళలు ప్రాయోగిక నైపుణ్యాలను నేర్చుకుని భవిష్యత్తులో స్వయం ఉపాధి అవకాశాలను పొందగలరని నిర్వాహకులు తెలిపారు. జేసీఐ ఇచ్ఛాపురం లేడీ జేసీస్ మద్దతు ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. మహిళలను నైపుణ్యాభివృద్ధి ద్వారా సాధికారత దిశగా ముందుకు తీసుకెళ్లడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఈ సందర్భంగా జేసీఐ ఇచ్ఛాపురం అధ్యక్షుడు జెసి బోయిన శ్రవణ్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి రంగంలో మహిళల ప్రాముఖ్యతను వివరించారు. కాబిల్ కార్యక్రమం లక్ష్యాలను స్పష్టంగా తెలియజేస్తూ, జేసీఐ ఇండియా మరియు జ్యోతి బ్యూటీ పార్లర్ తరఫున శిక్షణ పొందుతున్న మహిళలకు పూర్తి సహకారం అందించనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తిచేసిన వారికి పాల్గొన్న ధృవపత్రాలు (సర్టిఫికెట్లు) అందజేస్తామని పేర్కొన్నారు. అలాగే ఈ కాబిల్ కార్యక్రమం మహిళలకు భవిష్యత్తులో ఆదాయం సంపాదించే నైపుణ్యాలను అందించి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో సహాయపడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ జెసి సంతోష్ సాహు, కమ్యూనిటీ డెవలప్మెంట్ డైరెక్టర్ జెసి కేవీబీ రాజ్‌కమల్, వైస్ ప్రెసిడెంట్ గ్రోత్ అండ్ డెవలప్మెంట్ హెచ్‌జిఎఫ్ చి. పవన్ పాల్గొని ట్రైనర్‌ను శిక్షణ పొందుతున్న మహిళలను అభినందిస్తూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రోత్సహించారు. ట్రైనర్ జ్యోతి మాట్లాడుతూ మహిళల సాధికారత కోసం జేసీఐ ఇచ్ఛాపురం చేపట్టిన ఈ కార్యక్రమం పట్ల తనకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఇది గ్రామీణ ప్రాంతం అయినప్పటికీ ఎక్కడైనా సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి జేసీఐ సిద్ధంగా ఉండటం నిజంగా అభినందనీయం అని పేర్కొన్నారు. మహిళల సాధికారత కోసం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం చాలా గొప్ప విషయమని ఆమె అన్నారు.

## శ్రీరామ్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

**సోంపేట మార్చి 8(వార్త):** మహిళా దినోత్సవం సందర్భంగా సోంపేట పట్టణంలోని శ్రీరామ్ ఫైనాన్స్ కార్యాలయం ఆవరణలో బ్రాంచ్ మేనేజర్ రెల్ల చక్రధర్ ఆధ్వర్యంలో ఆదివారం టూ వీలర్ లోన్ మెగా మేళాను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సోంపేట ఈఓ శాంతకుమారి హాజరయ్యారు. అనంతరం టూ వీలర్ లోన్ మెగా మేళాను ప్రారంభించి, మహిళా దినోత్సవం వేడుకలను నిర్వహించారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆడపడుచులకు ప్రత్యేకమైన టూ వీలర్ లోన్ ఆఫర్ ప్రకటించడం సంతోషంగా ఉందని సోంపేట ఈఓ శాంతకుమారి అన్నారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ తమదైన ముద్ర వేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బైక్ షోరూమ్ ఓనర్ శివాజీ, శ్రీరామ్ ఫైనాన్స్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.






## కంబిరిగాం భూముల పరిశీలన

**పలాస, మార్చి 8 (వార్త):** కంబిరిగాం భూములను పలాస మండల తాసిల్దార్ టీ కళ్యాణ చక్రవర్తి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ సర్వే నెంబర్ 18 లో ఒకచోట ఆరు సెంట్లు మరోచోట సెంటున్నర అధికంగా మట్టి వేసినట్లు గుర్తించిన రెవెన్యూ అధికారులు తన దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. ఆ మట్టి తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట సిఐ రామకృష్ణ, సర్వేయర్, సచివాలయం సిబ్బంది తదితరులు ఉన్నారు.

## రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక



**శ్రీకాకుళం, మార్చి 8 (వార్త):** జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 'శాప్ లీగ్ బ్యాడ్మింటన్ (మాస్టర్స్)' జిల్లా స్థాయి పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో సుమారు 20 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఈ పోటీల్లో వివిధ విభాగాల్లో క్రీడాకారులు తమ ప్రతిభను చాటారు. వివిధ కేటగిరీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారుల వివరాలను జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి మహేష్ వెల్లడించారు. 35 ఏళ్ల పైబడిన పురుషుల సింగిల్స్ విభాగంలో ఏ. మోహన్ రావు విజేతగా నిలవగా, డబుల్స్ విభాగంలో ఏ. మోహన్ రావు, వై. లక్ష్మణరావు జంట విజయం సాధించింది. అలాగే, 35 ఏళ్ల పైబడిన మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో కిల్లి హరీష్, ఐ. ఆశాలత జంట విజేతలుగా నిలిచారు. 45 ఏళ్ల పైబడిన పురుషుల సింగిల్స్‌లో నాగేశ్వరి బెనర్జీ బెహరా, డబుల్స్‌లో కె. కిరణ్ కుమార్, పి. శ్యామ్ సుందరరావు జంట ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 14, 15 తేదీల్లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో శ్రీకాకుళం జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని డి ఎస్ డి ఓ తెలిపారు.

## ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి




**మందస, మార్చి 8(వార్త):** టెట్ నోటిఫికేషన్ కు ముందు అనగా 2010 సంవత్సరం కన్నా ముందు నియామకం పొందిన ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 10న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా జరుగుతుందని ఏపీటీఎఫ్ మండల శాఖ నాయకులు చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఏపీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో మందస మండలంలోని కొత్తపల్లి, హరిపురం, లోహరిబంద, అంబుగాం, సిరిపురం, సొండిపూడి తదితర పాఠశాలలో విరామ సమయాల్లో చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం సర్వీస్ లో ఉన్న ఉపాధ్యాయులకు మళ్ళీ టెట్ నిర్వహించడం సరికాదని, అలాగే పెండింగ్ లో ఉన్న ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కొరకు ఉపాధ్యాయులు భవిష్యత్ పోరాటాలకు సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గవ్వ భీమారావు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బి.గోపీచంద్, టి.ఉమామహేశ్వరరావు, సీతమ్మ, ఎన్.తారకేశ్వరరావు, బి.సుందర్ సాల్మన్, ఏపీటీఎఫ్ మందస మండల శాఖ ఇతర కార్యవర్గ సభ్యులు ఎస్.కిరణ్ కుమార్, డి.వైకుంఠరావు, మోహనరావు, సింహాచలపతి, డి.చంద్రశేఖర్, గోపినాథ్ బెహరా, గిరిధర్, కరుణాకర్, ఎం.చిత్రసేను, ఎం.లక్ష్మణరావు, కె.ధనరాజు, వై.రవికుమార్, డి.కృష్ణారావు, ఎం.దామోదరం, సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జెండర్ రీసోర్స్ సెంటర్ ప్రారంభం



**ఇచ్ఛాపురం, మార్చి 8 (వార్త):** స్వయం సహాయక సభ్యులు ఆర్థికంగా సాధికారత సాధించటంలో ఎదురయ్యే జెండర్ సమస్యలను పరిష్కారం చేసేందుకు మండల మహిళా సమైఖ్యలో జెండర్ రీసోర్స్ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేయటం జరిగిందని ప్రభుత్వ విప్, నియోజకవర్గ ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మెప్మా కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన జెండెర్ రీసోర్స్ సెంటర్‌ను ఆదివారం విప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జెండర్ రీసోర్స్ సెంటర్లు మహిళలకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పరిష్కారాలు అందుతాయని అన్నారు. అలాగే హింసాత్మక చర్యలను ఎదుర్కొంటున్న బాధితులకు అండగా జెండర్ కమిటీ ఉంటుదని అన్నారు పోలీస్, ఐసీడీఎస్, స్టాప్ సెంటర్, మెడికల్ డిపార్ట్మెంట్ వారితో సమన్వయం చేసుకుంటూ సమస్య పరిష్కారం చేయటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఎస్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## నరసన్నపేటలో పనిచేయని చేతి పంపు బోర్లు

**నరసన్నపేట, మార్చి8(వార్త):** నరసన్నపేట పంచాయతీ పరిధిలో ఉన్న పలుచోట్ల చేతి పంపు బోర్లు పనిచేయడం లేదు. ఈ బోర్లకు మరమ్మతులు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొన్ని పంచాయతీ బోర్లను పంచాయతీ ఈవో అనుమతులు లేకుండా తొలగించి, ఆ స్థలాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ప్రజా ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత ఉన్న అధికారులు ఇటువంటి చర్యలు చేపట్టడం బాధాకరమని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే నరసన్నపేటలో ఉన్న అన్ని పంచాయతీ బోర్లను మరమ్మతులు చేసి ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



## టైలర్ కుటుంబానికి ఆర్థిక సహాయం

**సోంపేట మార్చి 8(వార్త):** పట్టణంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన టైలర్ బొల్ల జయరాం కుటుంబానికి స్థానిక లోకనాధేశ్వర టైలర్స్ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఆదివారం 8 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని మృతిని భార్యకు అందజేశారు. మిత్రుడు జయరాం మృతి పట్ల టైలర్ సంఘం ప్రగాఢ సానుభూతిని కుటుంబానికి తెలిపారు. జై రామ్ ఆత్మకు భగవంతుడు శాంతి ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు బుంగ మోహనరావు కార్యదర్శి దుంప రమేష్ దున్న బైరాగి సాహుకారి జానకిరావు భక్తుల హేమంత్ నామాల తేజ విక్కీ సభ్యులు పాల్గొన్నారు.



## ఘనంగా ప్రారంభమైన నింభాషినమ్మ జాతర



**సోంపేట మార్చి 8(వార్త):** పట్టణంలో వెలసిన నింభాషిని అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఎనిమిదవ వార్షికోత్సవం సందర్భంగా ఈ ఏడాది మూడు రోజులపాటు ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జాతర మహోత్సవం జరగనుంది. ఆదివారం ఉదయం నుంచి విఘ్నేశ్వర పూజతో మొదలైన కార్యక్రమాలు పలు పూజ కార్యక్రమాలతో రోజంతా నిర్వహించి సాయంత్రం వేళ భారీ సంఖ్యలో హాజరైన భక్తులతో జాతర కళకళలాడింది. ఈ సందర్భంగా మరోవైపు కూచిపూడి నాట్యం తో పాటు కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా ప్రదర్శించారు. సోంపేట తో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. మాజీమంత్రి గౌత శివాజీ ముఖ్యఅతిథిగా హాజరై ఆలయ ఆవరణలో నిర్మించిన కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అభివృద్ధి కమిటీలు శ్యామసుందర్ శివాజీని ఘనంగా ఆహ్వానించి కార్యక్రమాన్ని నిర్వహించారు. హాజరైన భక్తులందరికీ అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

## వైభవంగా పుష్పయాగం



**సోంపేట మార్చి 8(వార్త):** పట్టణంలో వెలసిన సత్యనారాయణ స్వామి ఆలయం ద్వితీయ వార్షికోత్సవం ఆదివారంతో ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వ ర్యంలో విశేష కార్యక్రమాలను నిర్వహించారు. అందులో భాగంగా ఆదివారం స్వామివారికి వెయ్యికిలోల పుష్పాలతో పుష్పయాగాన్ని వైభ వంగా నిర్వహించారు. ముందు రోజు శనివారం స్వామివారి తిరువీధుల కార్యక్రమం ఘనంగా నిర్వహించి దాంతోపాటు స్వామివారికి అభిషే కించే పుష్పాలను పెద్ద సంఖ్యలో బుట్టలతో మహిళలు తలపై పెట్టుకుని ఊరేగించారు. అవే పుష్పాలను ఆదివారం ఉదయం పెద్ద సంఖ్యల ఈ కార్యక్రమం అంతా వార్షికోత్సవాన్ని నిర్వహించేందుకు విచ్చేసిన ప్రముఖబ్రాహ్మణుల చేతుల మీదుగా ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాదిమంది భక్తులు హాజరయ్యారు. హాజరైన భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందిస్తూ మధ్యాహ్నం నుంచి భారీ స్థాయిలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఎక్కడ ఎటువంటి లోటుపాట్లు లేకుండా భక్తులందరికీ పలు సౌకర్యాలు కల్పిస్తూ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఎంతో ఘనంగా నిర్వహించిన ఆలయ ధర్మకర్తతో పాటు అభివృద్ధి కమిటీ ప్రతినిధులను భక్తులు అభినందించారు.

## కోదండరామ స్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవంలో అచ్చెన్న



**కోటబొమ్మాళి, మార్చి 8(వార్త):** కోటబొమ్మాళి మండలం ఎత్తురాళ్లపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండరామ స్వామి ఆలయం ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, నిర్వహించారు. గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధతో నిర్మించిన ఈ ఆలయం భక్తులకు ఆధ్యాత్మిక శాంతిని, సౌఖ్యాన్ని ప్రసాదించే ప్రధాన కేంద్రంగా నిలవాలి ఆకాంక్షించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, తెలుగు దేశం పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నీలకంటేశ్వర స్వామి దేవాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

**నరసన్నపేట, మార్చి 8(వార్త):** నరసన్నపేట పట్టణంలోని స్థానిక వంశధార కాలనీలో ఉమా సహిత నీలకంటేశ్వర స్వామి దేవాలయ పునర్నిర్మాణ పనులకు నరసన్నపేట శాసనసభ్యుడు బగ్గు రమణమూర్తి శంకుస్థాపన చేశారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన కొబ్బరికాయ కొట్టి దేవాలయ పునర్నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవాలయాలు ఆధ్యాత్మికతకు కేంద్రాలుగా నిలుస్తాయని, భక్తుల విశ్వాసానికి ప్రతీకలని అన్నారు. దేవాలయ పునర్నిర్మాణం ద్వారా భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆధ్యాత్మిక వాతావరణం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమానికి హాజరైన భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణన్నాయుడు, రాష్ట్ర పొందర కూరాకుల కార్పొరేషన్ చైర్మన్ దామోదర నరసింహులు, రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ జామి వెంకట్రావు, వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ శిమ్మ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ గొద్దు చిట్టిబాబు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి బలగ భారతి, జిల్లా కార్యదర్శి పూతి రమణ, పోలాకి పిఎసిఎస్ అధ్యక్షుడు భైరి భాస్కరరావు, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కింజరాపు రామారావు, మాజీ ఎంపిటిసి సభ్యుడు పీస కృష్ణ, తాళభక్తుల గోవిందరావు, వార్డు సభ్యులు బోయిన సతీష్, బతకల సంతోషి, బోయిన ఆనంద్, బోయిన నరసింహమూర్తి, జిల్లా తెలుగునాడు ఫెడరేషన్ అధ్యక్షుడు బలగ ప్రహర్ష, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు రావాడ గణపతిరావు, మొయ్యి హరికృష్ణ, బతుకల గోపి, చిట్టి పంతులు, దొంకాన మణికంఠ, మల్ల భూలక్ష్మీ పాల్గొన్నారు.



# వైస్సార్సీపీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం



**ఇచ్ఛాపురం,మార్చి 8 (వార్త):** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఉలాల భారతీ దివ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజంలో తమకు లేకపోయినా సేవచేసే ప్రముఖ మహిళలను సత్కరించుకున్నారు. మహిళలు సాదారంగా లేని వృత్తి ఫొటోగ్రఫీ వృత్తి గా ఎంచుకొని తండ్రి లేని కుటుంబాన్ని పోషించు కుంటున్న ఈదుపురం గ్రామానికి చెందిన కుమారి ఆశి లతా రెడ్డిని, కొఠారి గ్రామనికి చెందిన కొయ్య కమలమ్మ 72 ఏళ్ళ వయస్సులో కూడా నియోజకవర్గ ప్రాంతంలో ఎక్కడ ఆధ్యాత్మిక కార్యక్రమం జరిగినా కొఠారి సర్పంచ్ దుక్క ధనలక్ష్మి టీం తో కలసి ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా వయస్సు భారమనుకోకుండా నిరంతరం ప్రతిఫలాపేక్ష లేని సేవ చేస్తున్న కొయ్య కమలమ్మని, నిలువ నీడలేకపోయినా, పోషించే దిక్కు లేని అనాద అయినా అక్కడక్కడా చేతనైన పనులు చేసుకుంటూ తనకు అందిన భోజనంలో కూడా వీధి కుక్కలకు, వీధుల్లో నిర్లక్ష్యం గా విడచిపెట్టిన, ఒట్టిపోయిన ఆవులకు ఆహారం పెట్టే భూతదయ కలిగిన వృద్ధ మహిళ ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన అంబటి మాణిక్యం, గత 15 సంవత్సరాలుగా చైల్డ్ లైన్ సేవలు చేస్తూ అనేక ఒత్తిడిలు, బెదిరింపులకు వెరవ కుండా బాలికల రక్షణకు, బాల్య వివాహాల్లో చిన్న వయస్సులోనే వివాహాలు చేస్తున్న బాలికలను రక్షిస్తూ తల్ల, తండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తూ అనేక మంది బాలికలకు క్రొత్త జీవితాలు కల్పించారు. ఇటీవల 16 వ వార్డులో సమాజానికి భయపడి ఓ తల్లి తన బాలికను ఇంటిలో ఎవరికీ కనిపించకుండా నిర్బందించిన సంఘటనలో తల్లిని నచ్చజెప్పి ఆ బాలికను నిర్బంధం నుండి విడిపించిన జాస్మిన్ కుమారిని సత్కరించుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమనవ్య కర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి, వైస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, ఎంపిపి బోర పుష్ప పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సోంపేట జడ్.పి.టి.సి తడక యశోద, కొఠారి, జింకిబద్ర, పలాసపురం కరాపాడు సర్పంచ్ లు దుక్క ధనలక్ష్మి, తామాడ పద్మావతి, తడక జోగారావు, మురపాల లచ్చయ్య లొద్దపుట్టి2 ఎంపిటిసి ఆశి మందాకిని, మాజీ డిసిఎంఎస్ అధ్యక్షులు సల్ల సుగుణ ఇచ్ఛాపురం నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు నర్తు ప్రేమ్ కుమార్, స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ప్రత్తి అన్వేష్, మాజీ జడ్.పి.టి.సి దక్కత నూకయ్య రెడ్డి, మాజీ సర్పంచ్ బాకి లక్ష్మీనారాయణ, సల్ల దేవరాజు, నర్తు భానోజీరావు, సప్ప వంశీ అనపాన శ్రీరాం, సాడి జయరాం, జుత్తు కామేశ్వరరావు, నర్తు శ్రీను, కోట హరికృష్ణ ,బోరుభద్ర పాపయ్య, పట్టణంలో పలు వార్డుల నుంచి వచ్చిన మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భం పురస్కరించుకొని మహిళా ప్రతినిధులను ప్రోత్సహించిన కారింగి మోహనరావు, తడక జోగారావు, సల్ల దేవరాజు లను సత్కరించారు.

## ఆమె కృషికి జాతీయ గౌరవం

*** జాతీయ మహిళా సదస్సుకు శాంత కుమారికి ఆహ్వానం * రాష్ట్రం నుంచి ఎంపికైన ఆరుగురిలో ఈమె ఒకరు * సోంపేటలో సర్వత్ర హర్షం**





**సోంపేట మార్చి 8 (వార్త):** ప్రభుత్వ ఉద్యోగిగా విధుల్లో అంకితభావం... పని విషయంలో నేర్పరితనం... లక్ష్యసాధనలో చిత్తశుద్ధి... వెరసి ఆమెను జాతీయస్థాయిలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 11న న్యూఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ మహిళా సదస్సుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఎంపికైన ఆరుగురు మహిళా ఉద్యోగులలో సోంపేట గ్రామ సచివాలయాల డిప్యూటీ ఎంపీడీవో గా విధులు నిర్వహిస్తున్న ఎం శాంతకుమారి ఒకరిగా ఎంపిక కావడం విశేషం. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఆహ్వానం రావడంతో సోంపేటలో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది. ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం న్యూఢిల్లీలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రంలో మార్చి 11న జాతీయస్థాయిలో 700 మంది మహిళలతో భారీ సదస్సును నిర్వహిస్తున్నారు. మన రాష్ట్రం నుంచి మహిళా ఉద్యోగులు ఎందుకు ఆరుగురు మాత్రమే ఎంపిక కాగా అందులో శాంతకుమారి ఒకరు. 2002లో పంచాయతీరాజ్ శాఖలో జూనియర్ అసిస్టెంట్ గా విధుల్లో చేరిన శాంతకుమారి అంచలంచలుగా ఎదుగుతూ వివిధ హోదాల్లో పని చేస్తూ ప్రస్తుతం సోంపేట మండల డిప్యూటీ ఎంపీడీవో గాను మరోవైపు సోంపేట మేజర్ పంచాయతీ కార్య నిర్వహణ అధికారిగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఉద్యోగ నిర్వహణను ఎంతగానో బాధ్యతగా స్వీకరిస్తూ ఉద్యోగాన్ని ప్రేమిస్తూ లక్ష సాధన కోసం నిరంతరం శ్రమిస్తూ తోటి సిబ్బందితో చక్కని సమన్వయంతో విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ కార్యక్రమాల అమలులోను, పంచాయతీ ద్వారా చేపట్టే నిరంతర కార్యక్రమాల విజయవంతంలోనూ శాంతకుమారి నిరంతరం ఎనలేని పాత్ర పోషిస్తున్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఇంటి పన్నుల వసూళ్లలోనూ వేలాది ఇంటి పన్నుల బకాయిలను సవాల్గా స్వీకరించి సిబ్బంది సహకారంతో విజయవంతంగా లక్ష్యాన్ని పూర్తి చేయించారు. గత ఏడాది జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో బారువాలో నిర్వహించిన బీచ్ ఫెస్టివల్ లోను శాంతి కుమారి ఆదర్శనీయమైన పాత్రను పోషించారు. తన విధులతో జిల్లా అధికారులను ఆకర్షించారు. మొదటినుంచి ఇదే పంథా కొనసాగిస్తున్న ఆమెకు జిల్లాస్థాయిలో పలుమార్లు అవార్డులు ప్రశంసలు దక్కాయి. జాతీయస్థాయిలో ఉన్నతశ్రేణిలో సేవలందిస్తున్న ప్రభుత్వ అధికార యంత్రాంగంలో గల పలువురు మహిళలు ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న పలువురు మహిళలను ఎంపిక చేసి జాతీయ మహిళా సదస్సు ద్వారా మహిళా లోకానికి ఒక మంచి సమాచారాన్ని అందించే ప్రక్రియకు కేంద్ర ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాన్ని రూపొందించింది. ప్రభుత్వ పథకాలు సక్రమంగా క్షేత్రస్థాయిలో అమలు చేయడం ప్రభుత్వ ఆశయాల మేరకు ఆయా ప్రాంతాల్లో మహిళలను నిరంతరం జాగృతం చేస్తూ వారి సంక్షేమానికి అభివృద్ధికి కృషి చేస్తున్నటువంటి బాధ్యత గల మహిళలతో న్యూఢిల్లీలో సదస్సు నిర్వహించి తద్వారా కోట్లాదిమంది మహిళల సంక్షేమానికి మరింత ఊతం ఇచ్చే దిశగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో మహిళా మణిగా ఎంపికైన శాంత కుమారిని సర్వత్ర అభినందిస్తున్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ

**ఇచ్ఛాపురం,మార్చి 8 (వార్త):** పురుషోత్తపురం అర్ ఎం పి డాక్టర్ సాడి రామారావు కుమారుడు ఇటీవలే అనారోగ్యం తో మృతి చెందారు. ఆ కుటుంబానికి నియోజికవర్గ వైస్సార్సీపీ కోఆర్డినేటర్ సాడి శ్యామ్ ప్రసాద్ రెడ్డి , రాష్ట్ర బీసీ విభాగం కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, రాష్ట్ర పురపాలక సంఘం కార్యదర్శి సుగ్గు ప్రేమ్ కుమార్, ఎస్ సి సెల్ విభాగం సల్ల దేవరాజు గారు, 2వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి చాట్ల తిరుపతి, డి కేశవ, డి మాదవరావు, సిచ్ కృష్ణ, ఎన్ నందీష్ తదితరులు పరామర్శించారు. అలాగే బహుదా రమణ కుటుంబాన్ని కూడా పరామర్శించారు.

## రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

**కంచిలి మార్చి 8(వార్త):** ఆరవ సరియా పల్లి గ్రామం నుంచి ఏపీ మోడల్ స్కూల్ వరకు 40 లక్షల రూపాయల నిధులతో సిమెంట్ రహదారి నిర్మాణానికి ఆదివారం మండల టిడిపి అధ్యక్షుడు మాదిన రామారావు తో పాటు పలువురు స్థానికులు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల మౌలిక సౌకర్యాలు కల్పనకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని అన్నారు. ప్రభుత్వానికి ఎన్ని ఇబ్బందులు ఎదురైనా గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని పేర్కొన్నారు. ఎంతో అవసరమైన ఇటువంటి రహదారుల నిర్మాణాన్ని గతంలో ప్రభుత్వాలు విస్మరించిన ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో అధిక ప్రాధాన్యం ఇచ్చి అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వాసాల రమేష్ రామారావు సూర్యనారాయణ రెడ్డి పురుషోత్తం శ్రీకాంత్ కిషోర్ పాడి మన్మధరావు పైల మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీముఖలింగేశ్వర క్షేత్ర అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

**జలుమూరు, మార్చి 8(వార్త):** దక్షిణ కాశీగా ప్రసిద్ది చెందిన శ్రీముఖలింగేశ్వర క్షేత్రాన్ని సందర్శించే భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ శ్రీముఖలింగేశ్వర దేవస్థానం అర్చక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రధాన అర్చకుడు నాయుడు గారి రాజశేఖర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్.రావత్ ను ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీముఖలింగం గ్రామంలో క్షేత్రానికి వచ్చే భక్తుల కోసం అప్రోచ్ రోడ్డును లైటింగ్ సౌకర్యంతో నిర్మించాలని, అలాగే క్షేత్రానికి రెండు వైపులా స్వాగత ద్వారాలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ అభివృద్ధి పనుల కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. శ్రీముఖలింగేశ్వర క్షేత్రానికి ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారని, వారికి తగిన సౌకర్యాలు లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు తెలియజేసినా ఇప్పటివరకు ఎలాంటి ఫలితం రాలేదని కూడా పేర్కొన్నారు. ఈ విషయంపై స్పందించిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్. రావత్ భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం తరఫున నిధులు మంజూరు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయుడు గారి రాజశేఖర్ తెలిపారు.

## పార్టీ బలోపేతానికి సమన్వయంతో పనిచేయాలి

*** మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ * నరసన్నపేట వైసీపీ పరిశీలకుడిగా బాధ్యతలు స్వీకరించిన సూరిబాబు**



**నరసన్నపేట, మార్చి8 (వార్త):** నరసన్నపేట నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వైసీపీ కళింగ వైశ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ నాయకులు అందవరపు సూరి బాబు నరసన్నపేట నియోజకవర్గ పార్టీ పరిశీలకులుగా నియమితులైన సందర్భంగా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులు కుంభ రవిబాబు పార్టీ ప్రమాణ పత్రాన్ని చదివి వినిపించగా, సూరిబాబు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ యువ నాయకులు ధర్మాన కృష్ణ చైతన్య పాల్గొని నూతన పరిశీలకుడు సూరిబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. యువతను పార్టీ వైపు ఆకర్షించడంలోనూ, నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాల్లోనూ కార్యకర్తలు చురుగ్గా వ్యవహరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు, అనుబంధ విభాగ అధ్యక్షులు, క్లస్టర్ కో కోఆర్డినేటర్లు, సర్పంచ్లు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

# అంగూరులో అభయాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠ



**సారవకోట, మార్చి 8(వార్త):** సారవకోట మండలం అంగూరు గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి స్వామివారిని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అభయాంజనేయ స్వామి మందిర ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు మెండ దాసునాయుడు పాల్గొన్నారు. భక్తులతో కలిసి మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట సారవకోట వైస్ ఎంపీపీ శోభనపు మురళి, కొమ్ముసరియపల్లి సర్పంచ్ గొంటి లక్ష్మణరావు, క్లస్టర్ కోర్డినేటర్ పట్టా ఉమామహేష్, మొదిలి జగదీష్, సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అభయాంజనేయ స్వామి వారి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి నరసన్నపేట నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన హాజరయ్యారు. ఆమె వెంట రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి ధర్మాన తేజ్ కుమార్, తెలుగుదేశం నాయకుడు చిన్నాల వెంకట సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, సారవకోట పిఎసిఎస్ చైర్మన్ సురవరపు తిరుపతిరావు, క్లస్టర్ ఇన్చార్జి పట్ట ఉమామహేశ్వరరావు, సారవకోట వైస్ ఎంపీపీ ప్రతినిధి శోభనపురం మురళీధర్, పిఎసిఎస్ డైరెక్టర్ శిమ్మ రామకృష్ణ, గొంటి లక్ష్మణ్, పిల్లా నంద కిషోర్, దువ్వారి జయరాం, రావాడ సురేష్, చల్ల ఆనంద్, ఇసా నాగరాజు, మొదిలి జగదీష్, దోల సాయిరాం, బలగ రవి మరియు ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎంపీటీసీ కుటుంబానికి పరామర్శ

**ఇచ్ఛాపురం,మార్చి 8 (వార్త):** మండపల్లిగ్రామ పంచాయతీ తోటూరు గ్రామనికి చెందిన ఎంపీటీసీ కాళ్ళ గోపి తండ్రి గంగయ్య పెద్దకర్మ సందర్భంగా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం మండలం మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు, ఎల్ పద్మనాభం, ఎపి రాష్ట్ర ప్రభుత్వ నాటక అకాడమీ డైరెక్టర్ దక్కత కామేశ్వరరావురెడ్డి, ఎస్ సహదేవ్ రెడ్డి, మాధవరెడ్డి, బి.లోహిదాస్, కోటరామారావు, కురస్వామి, చంద్రశేఖర్, తవిటయ్య తదితరులు పాల్గొన్నారు.

## జాతి నిర్మాణంలో మహిళల పాత్ర కీలకం

**నరసన్నపేట, మార్చి 8(వార్త):** నరసన్నపేట డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెద్దాడ లత పాల్గొని మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు జాతికి వెన్నుముకలని పేర్కొన్నారు. కుటుంబ బాధ్యతలతో పాటు సామాజిక బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ జాతి నిర్మాణంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. నేటి మహిళామణుల చైతన్యం వల్ల రాజకీయ, ఉద్యోగ రంగాలలో సమగ్ర మార్పులు చోటు చేసుకున్నాయని ఆమె అన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**పలాస, మార్చి 8 (వార్త):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం పలాస నియోజకవర్గ స్థాయిలో పలాస హై స్కూల్ కళా ప్రాంగణంలో అంగరంగ వైభవంగా ఆదివారం నిర్వహించారు. ఈ ఉత్సవాలలో వివిధ రంగాలలో నైపుణ్యం కనుక పరిచిన మహిళా నేతలకు ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అభివృద్ధి అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడి వినాయక రామ్, ఏ పి టి పి సి చైర్మన్ వజ్జ బాబురావు, గ్రంథాలయ చైర్మన్ విట్టల్ రావు, పిఎసిఎస్ చైర్మన్లు మల్ల శ్రీనివాసరావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు వసంత్ కుమార్, ఎన్ రమేష్ నాయుడు, ఏపీవోలు, సివిఏపీ యూనిట్ సభ్యులు, డ్వాక్రా గ్రూపు సభ్యులు సిడిపిఓ మందస, కాశిబుగ్గ పరిధిలో డ్వాక్రా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చింతాడపేటలో రామయోగిబాబా సేవాశ్రమంలో సత్సంగ సభ

**పోలాకి, మార్చి 8(వార్త):** పోలాకి మండలం చింతాడపేటలో వేంచేసి ఉన్న రామయోగిబాబా సేవాశ్రమంలో ఆదివారం సత్సంగ సభ కార్యక్రమం నిర్వహించారు. శ్రీకాకుళానికి చెందిన అచల పరిపూర్ణతత్వ నిష్ణాతులు తంగుడు ప్రసాదరావు మాట్లాడుతూ మానవ జీవితంలో భక్తి, భగవంతుని చింతన ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సేవాశ్రమ అధ్యక్షుడు బమ్మిడి విశ్వనాథం, కరుణాకర్ మాస్టారు, అనంతరావు పాల్గొన్నారు.

## కాళీ మాత ఆలయ శుభరాట ఆవిష్కరణ

**ఇచ్ఛాపురం,మార్చి 8 (వార్త):** కాళీమాత ఆలయ ప్రతిష్ఠ పూజా శుభరాట పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇచ్ఛాపురం మండలం నీలాపుపుట్టుగలో గ్రామంలో యజ్ఞం నిర్వహిస్తున్నారు. శుభరాట కర్రను శాస్త్రోక్తంగా పూజలు చేసి ఆవిష్కరించారు. ఏప్రిల్11 నుండి 15వరకు యజ్ఞం జరుగుతుందని కమిటీ తెలిపింది.


Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546